
# అంతర్ముఖుడు



**సింగరాజు లింగమూర్తి**

జగన్నాథం ఆత్మహత్య చేసుకున్నాడన్న వార్త పత్రికల్లో చూసి నేనేకాదు అతన్నెరిగిన వారందరూ ఆశ్చర్యపోయారు.

జగన్నాథానికి పరిచయస్తులు ఎందరో ఉన్నారు. స్నేహితులు, అత్యంత సన్నిహితులు అయినవాళ్ళు కూడా చాలామంది ఉన్నారు.

అంతస్తుల అంతరాలు బాగా తెలిసినవాడు జగన్నాథం. అన్ని అంతస్తుల వారితోనూ, విభిన్న ప్రవత్తులు గలవారితోనూ సౌమ్యంగా మెలగగల అతని మనస్తత్వం అపూర్వంగా, చిత్రంగా తోస్తుంది.

చిరునవ్వుతో స్నేహంగా పలుకరించడం, అదే చిరునవ్వుతో ఎంతో సామరస్యంగా సమాధానా లివ్వడం అతనిలోని ప్రత్యేకత.

జగన్నాథాన్ని తెలియనివారు చాలా అరుదుగా ఉంటారు. పట్నంలో అతని సహాయం కోరని వారుండరు. అతని సభ్యత్వం లేని సంస్థలేదు. ఎన్నిటిలోనో గౌరవ పదవులను అలంకరించాడు. కొన్ని సంస్థలకు సలహాదారు. రాజకీయాలలోకి ప్రత్యక్షంగా దిగలేదన్న మాటేగాని పరోక్షంగా ఎంతో పలుకుబడి ఉన్నవాడు. పెద్ద పెద్ద నాయకులు (మంత్రులు కూడానని చెప్పుకొంటారు) జగన్నాథం సహకారం, సలహా అపేక్షించడం, వాళ్ళందరూ కలిసి సరదాగా చతుర్ముఖ పారాయణం జరపడం అనోటా అనోటా విన్న సంగతులు. అన్నిటికీ మించి మంచి వ్యవహార దక్షత, వ్యాపార దక్షత కలవాడు జగన్నాథం.

కిట్టనివాళ్ళు కొందరు జగన్నాథాన్ని బూర్జువా అన్నారుగాని అతని ప్రవర్తన చూసిన వాళ్ళెవరూ అతనితో పరిచయంలోకి వచ్చిన వాళ్ళెవరూ అతనిమీద అంత అభాండం వెయ్యడానికి పూనుకోరు. నా మటుకు నాకు అతను ఒక గొప్ప చతురుడైన రాజకీయవేత్త అనిపిస్తాడు. అయితే నీకు జగన్నాథం బాగా తెలుసా అంటే, 'అతనూ నేనూ ఓః బూజం ఫ్రండ్స్' మనిగాని అతను నన్నెంతో అభిమానంగా చూసేవాడని గాని నేను చెప్పినప్పుడు మీరు నమ్మాల్సివస్తుంది. పైగా 'ఏమిత్రా కోస్తున్నావ్' అని చచ్చినవాడు లేచివచ్చి అడుగడు కదా! ఇలా ఇంత గొప్పవాడితో నాకు పరిచయం ఉందని—ఇప్పుడు అతను చనిపోయినాక—చెప్పుకోడంవల్ల నాకు ఒరిగేది ఏమీ లేదు కాబట్టేన్ని, పైగా డబ్బాలు కొట్టే ఆత్మవంచన చేసుకునే మనిషి కాదురా అని మీరంతా నాకు కాతాలు ఇవ్వకపోరు కాబట్టీన్నీ నిజం చెప్తేస్తున్నా—జగన్నాథంతో నాకేం పరిచయంలేదు. అయితే మా సంఘం పని మీద కార్యదర్శితో కలిసి రెండుమూడుసార్లు జగన్నాథం దగ్గరకు వెళ్ళాను. నేను ప్రత్యేకించి అతనితో ఏమీ మాట్లాడకపోయినా మాటల మధ్యలో జగన్నాథం నావైపు చిరునవ్వుతో చూడడం, నేను ఆయన చెప్పేది వింటూ మందహాసం చిందించడం సజావుగానే జరిగిపోయింది. కాకపోతే ఒకసారి మాత్రం ఈమధ్య కొత్త పుస్తకాలేమైనా రాశారా?'' అని జగన్నాథం అడగడం నేను సమాధానం చెప్పడం జరిగింది. అంతే. అంతకుమించి మా పరిచయం పెరగలేదు. అమాత్రం పరిచయం ఏర్పడితే చాలు దాన్ని పెంచుకొని, జగన్నాథానికున్న బోలెడు పలుకుబడితో తమ తమ పనులు సాధించుకున్న సామాన్యులు

ఉన్నారు. కవులూ కళాకారులు ఉన్నారు. ఆయితే నీకున్న స్వల్పపరిచయంతోనే జగన్నాథాన్ని గొప్ప చతురుడైన రాజకీయవేత్తగా ఎలా నిర్ణయించావు అని అడిగితే దాని కథ కమామిషు చెప్పక తప్పదు.

చెప్పాను కదూ జగన్నాథానికి వ్యవహార దక్షత, వ్యాపారదక్షత ఉన్నాయని. అతనికి పట్నంలో నాలుగైదు వ్యాపారసంస్థలున్నాయి. వాటిల్లో హోల్‌సేల్ వ్యాపారం కూడా ఒకటి. అతని దగ్గర గుమాస్తా ఉద్యోగాలు చేసేవారుగాని, కాయకష్టం చేసుకొనేవారుగాని జగన్నాథాన్ని దైవంగా భావిస్తారు. 'నీకెంత జీతం కావాలి' అని అడిగి చెప్పించుకొని యింకో పది ఎక్కువే యిచ్చేవాడు. వాళ్లకే అవసరాలు వచ్చినా ఆదుకునేవాడు. ఈ మంచితనాన్ని ఉపయోగించుకొని ఎవరైనా జగన్నాథాన్ని మోసం చేయడానికి ప్రయత్నిస్తే "పిచ్చివాడ, దీనివల్ల నష్టపడేది నీవుకాని నేను కాదు—ఈసారి వదిలేస్తున్నా" అని ఔదార్యం కూడా చూపించేవాడు. రెండోసారి అలాగే చేస్తే ఉద్యోగంలోంచి తొలగిస్తాడు. మరో చోటుకుపోయి, తన పూర్వానుభవం చెప్పుకొని వాడు ఉద్యోగం అడిగితే "అక్కడే ఇమడని వాడివి మాదగ్గరేం చేస్తావు" అని పొమ్మనేవారు. వాడు మళ్లీ వచ్చి జగన్నాథం కాళ్లమీద పడాల్సిందే. అంత మంచివాడు జగన్నాథం....

ఏ సరుకు ఎలా నిలవచేయాలో, ఏ సరుకును ఎప్పుడు ఎలా విడుదల చేయాలో జగన్నాథానికి తెలుసు. ధరలు పెరిగినప్పుడు దానికి అంతర్జాతీయ కారణం ఏమిటో, గిట్టుబాటు ధర అంటే ఈనాడు ఎలా ఉండాలో ఇట్టే చెప్పగలడు. ఈనాడు ప్రతివస్తువు ధర ఆకాశాన్ని అందుకుంటున్నదంటే జగన్నాథం విడమరచి అరటిపండు ఒలిచి చేత ఉంచినంతగా చెప్తాడు.

జగన్నాథం ఏనాడో చౌకలో స్థలాలు కొన్నాడు. కొన్ని భవనాలు కట్టించాడు. అవసరం వచ్చినప్పుడు మంచి ధర పలికితే అమ్మాడు. కారు అమ్మడం, మరో కొత్త మోడల్ కొనడంకూడా అనేక సరదాగా ఉంటుందతనికి.

అసలు జగన్నాథానికి యిన్ని వ్యాపకాలున్న సంగతి చాలా మందికి తెలియదు. ఎప్పుడూ ప్రజాసంస్థల్లో, ప్రజాకార్యాల్లో నిమగ్నుడై ఉన్నట్టుగానే కనిపిస్తాడు.

ఈ ప్రజాసంస్థల్లోమటుకు ఎగిరెగిరి పడుతున్నట్టు కనిపించేవాడా? ఊహూఁ. మామూలు కార్యకర్త ఏమోలే అనుకునేట్టుగా ఉంటాడు. తనకేమీ కీర్తికాంక్ష లేదన్నట్టుగా, వ్యక్తిత్వానికి ప్రచారం సాధనం కాదన్నట్టుగా మెలుగుతాడు. 'డబ్బున్నవాడిదే రాజ్యం' అన్నట్టుగా కూడా ప్రవర్తించడు జగన్నాథం. "ఏదో—సంస్థ బాగు పడాలి—నలుగురికి ఉపయోగపడేదిగా ఉండాలి" అంటాడు. "నా కెందుకండీ ఈ అధ్యక్షపదవి—ఏదో మీరు కోరిన విరాళం యిచ్చాను" అని ఎంతో వినమ్రతగా అంటాడు. "సరే మీరింత బలవంతం చేస్తుంటే కాదనలేకపోతున్నాను" అంటూ ఆ పదవిని మొగమాటమికి లొంగిపోయి స్వీకరించేవాడు.

తనకేమీ పట్టనట్టుగా ఉంటూనే అంతా తానై మెలిగే జగన్నాథం వ్యక్తిత్వం చాలా సక్రృత్తుగా ఎదురవుతుంది.

క్రిందటిసారి జనరల్ ఎలక్షన్లు వచ్చినప్పుడు సన్నిహితులనుకుంటున్న మిత్రులు జగన్నాథాన్ని నామినేషన్ పడేయమన్నారు. "మీరు గెలవడం ఖాయం. మంత్రి కావడం అంతకంటే ఖాయం" అన్నారు. "ఆ సంగతి ఈ జగన్నాథానికి తెలియకనా" అని మనసులో అనుకొని ముసిముసిగా నవ్వుతూ, "ఆ బాదరాబందీ నా కెందుకయ్యా—మీరంతా ఉన్నారుగా" అనేశాడు. తానుగా నిలబడకపోయినా, తన అభ్యర్థిని ఎన్నికల్లో నిలబెట్టడం, గెలిపించడం, అంతటితో ఊరుకోక మంత్రిగా ఎంపిక చేయించడం జగన్నాథం పలుకుబడికి, చతురతకు ఒక నిదర్శనం. ముఠా తత్వాలు ఏర్పడి, అవి తీవ్రమైనప్పుడు ఉభయులకు సయోధ్య ఏర్పరచి ఇరుపక్షాలచేత 'భేష్' అనిపించుకొని వాళ్ల ఖుషీనిబట్టి కొన్ని ప్రయోజనాలు పొందాడూ అంటే అది జగన్నాథం స్వార్థమని అనుకుంటే ఎలా?

ప్రతివ్యక్తిలోనూ మంచీ—చెడూ రెండూ ఉంటాయి. రెండు దృక్కోణాలలోంచి మనిషిని చూడాలి. చెడ్డవాడికి ప్రపంచంలో ఉన్న దుర్గుణాలన్నీ ఆపాదించడం, మంచివాడికి ప్రపంచంలోని సద్గుణాలన్నీ అంటగట్టడం వెర్రితనం. ఈ రకంగా చూస్తే జగన్నాథాన్ని ఒక క్రొత్తరకం 'విలన్'గా నేను దర్శించాను.

జగన్నాథంలో పాపభీతి ఉంది. దైవభక్తి ఉంది. ఎన్ని అర్జంటు పనులున్నా, ఎంత ప్రముఖ వ్యక్తి జగన్నాథం కోసం వచ్చినా ఉదయం ఎనిమిది గంటల తర్వాతనే గాని ఈలోగా కలవడం సాధ్యంకాదు. విభూతిరేఖలమధ్య అర్థచంద్రాకారంగా దిద్దిన గంధం, దానిమీద కుంకుమబొట్టు, దండలకు, వక్షస్థలానికి రాసుకున్న విభూతిపట్టి, పట్టుతాపితా కట్టుకొని పూజాగృహం లోంచివచ్చే జగన్నాథాన్నిచూస్తే అల్ట్రా మోడరన్‌లలోకూడా ఏదో భక్తిభావం కలిగే జగన్నాథంమీద యింకాస్త గౌరవాన్ని పెంచుతుంది.

జగన్నాథం ధైర్యాన్ని చిరునవ్వుతో వేడుకుంటాడు. చిరునవ్వుతో ఆప్తులం అనుకుంటున్నవారిని పలుకరిస్తాడు. ఆ చిరునవ్వుతోనే బాధల్లో ఉన్నవారిని, తనను ఆశ్రయించుకున్నవారిని పరామర్శిస్తాడు. గోదాముల్లో నిక్కి నిక్కిచూస్తున్న వస్తుసంచారాలను చిరునవ్వుతో తిలకిస్తాడు. ఇటు బ్యాంక్ అకౌంటును, అటు ఇనుప పెట్టెలోని కరెన్సీని, బంగారాన్ని ఆప్యాయంగా చిరునవ్వుతో చూసి కనులకద్దుకుంటాడు. ఎక్కడైనా కాటకం వచ్చి ప్రజల ఆకలి చావులు ఎక్కువైనాయని అంటే చిరునవ్వుతో విరాళాలు యిస్తాడు. ఆ ప్రాంతానికివెళ్లి ఉచితంగా తినుబండారాలు, బట్టలలా సరఫరా చేయిస్తాడు. అతని ఔదార్యాన్ని ప్రశంసిస్తూ పత్రికల్లో ఫోటోలతో సహితంగా ప్రచురిస్తే "దైవం నా కిచ్చినదాంట్లోంచి సహాయం చేస్తున్నాను దీనికి ఆడంబరమంతా దేనికి" అంటాడు చిరునవ్వుతో. ఇటీవల దేశరక్షణకు భూరి విరాళం, బంగారం పెద్ద మొత్తంలో ఇచ్చిన ప్రముఖుల్లో జగన్నాథం ప్రథముడు.

ఇకపోతే పైకిపొక్కని వ్యవహారాలు జగన్నాథానికి సంబంధించినవి చాలామందికి తెలియవు అంటారు. అవి అవలక్షణాలని కొందరికి అనిపించినా జగన్నాథం ఒప్పుకోడు. "ప్రతివారికీ కొన్ని అభిరుచులుంటాయిగా" అంటాడు నవ్వుతూ.

పెద్ద పెద్ద వాళ్లంతా కూర్చుని పేకాటవేస్తే వేళతో సంబంధం ఉండేది కాదు. వాళ్ల ఆట వందలూ వేల మీదే గాని పదులూ—అయిదులూమీద ఉండేది కాదు. ఒక్కోసారి జగన్నాథమే కొందరికి ఆటకి పెట్టుబడి పెట్టేవాడు. కొన్ని సందర్భాల్లో బాకీపడిన మొత్తానికి అతనికి నోట్లు రాసిచ్చినవాళ్లూ ఉన్నారు. జగన్నాథానికి ఆటలో పోవడంకంటే రావడమే ఎక్కువగా ఉండేది. పెద్ద పెద్దలంతా తెల్లి

వారులా పేకాట ఆడుతున్నప్పుడు టీలకీ, టిఫిన్లకీ, సీసాలకీ గిరాకీ లేకుండా ఎలా ఉంటుంది. అదేం చిత్రమోగాని ఎంత తాగితే అంత సౌమ్యంగా, అంత హుందాగా, పొల్లుమాట లేకుండా ఆడేవాడు జగన్నాథం. “ఏదో కంపెనీకోసం తాగుతాగాని అదంటే అసలు ఇష్టంలేదు” అంటాడు. అదీ నిజమే ననిపిస్తుంది. పేకాటలో కూర్చున్నప్పుడు, పార్టీలకు వెళ్ళినప్పుడు తప్ప మరెప్పుడూ సీసాను దగ్గరకు రానివ్వడంటారు అంతరంగికులు. ‘సౌఖ్యం’ కావాలని పెరపెరలాడే వారికి డబ్బున్నా అనుభవించడం చేతకాదు కొందరికి. ఎంత రేటుకైనా ఆ ‘సౌఖ్యం’ కొనుక్కొని అనుభవించడం జగన్నాథానికి తెలుసంటారు కూడా. పెద్దవాళ్ల వ్యవహారాలు గోప్యంగా ఉంటాయి కాబట్టి సామాన్యులకు అందుపట్టవు. అసలు తెలియవు కూడా. పట్టణంలోకి ఏ సందర్భంలోనైనా అందమైన కళాకారిణులువస్తే జగన్నాథానికి పరిచయం కాకుండాపోయేవారుకారుట. అలాగని జగన్నాథం ఏ పచ్చని సంసారాన్ని పాడుచేయలేదనీ, ఏ స్త్రీని నిర్బంధించలేదనీ కూడా వాళ్లే అంటారు.

జగన్నాథాన్ని గురించి ఎవరికీ అంతుపట్టని విషయాలు రెండున్నాయి. అతను గృహస్థో, బ్రహ్మచారో, విధురుడో తెలియదు. అతను నివసించే మేడలో ఆడవాళ్ళు, మగవాళ్లూ కనిపిస్తూనే ఉంటారు. వాళ్లకీ జగన్నాథానికీ ఉన్న బంధుత్వమేమిటో కూడా ఎవరికీ తెలియదు. అసలు అతను ఆమేడలో ఉండే సమయమే చాలా తక్కువ. ఉన్నప్పుడు వయస్సునుబట్టి ఆ మేడలోవాళ్లు బాబాయనో, మామయ్యనో, అన్నాయనో అతణ్ణి ఏవేవో వరుసలుపెట్టి పలుకరిస్తుండడం చూడ వెళ్ళినవారికి తెలుసు.

జగన్నాథం దినచర్యలో పగలు పన్నెండు, ఒంటి గంటలమధ్య, రాత్రి మళ్ళీ అదే టైంలో అతను ఎక్కడ ఉంటాడో, ఏం చేస్తాడో కూడా సన్నిహితులు, అంతరంగికులు అనుకుంటున్నవారికి కూడా తెలియదు. ఆ రెండుగంటలసేపు జగన్నాథం ఎక్కడ ఉంటాడో తెలుసుకుందామని అతని డ్రైవర్ని కూపీ తీశారు. ఆ సమయాలలో కారును ఆయనే డ్రైవ్ చేసుకుపోతాడట.

అసలు జగన్నాథం ఆ పట్టణం వాడు అవునా—కాదా, అతని జన్మస్థలం ఏమిటి, ఏం చదువుకున్నాడు అన్న వివరాలు పర్శిత కందని అంశాల వంటివి.

ఇంతవరకూ వ్రాశాక మీరు వేయబోయే ప్రశ్నలు నేనే వేసుకున్నాను. సమాధానాలకోసం ఆలోచిస్తున్నా. మెదడు వేడెక్కిపోయింది. కుర్చీలో జారగిలబడి కళ్లు మూసుకున్నా. క్షణాలూ, నిమిషాలు గడిచిపోతున్నాయి.

మసక మసకగా ఏదో రూపం మసిలింది. క్రమంగా ఆ రూపం స్పష్టంగా దగ్గరగా వచ్చింది. ఎత్తుగా పెరిగి సంస్కారంలేక ముఖం మీద పడుతున్న క్రాపు, చిరుగుల నిక్కరు, రంగు వెలసిపోయి ఒక చెయ్యి వాలికలైన చొక్కాతో వో పనిమిదేళ్ల కుర్రాడు క్రిందకు జారిపోతున్న నిక్కరును పైకి ఎగదోసుకుంటూ వో పెద్ద హోటలు ముందు నిలబడ్డాడు. ముఖంలో దైన్యం, కళ్లల్లో ప్రాధేయత హోటలు యజమానిని కదిలించాయేమో, “వూరికే తిండెవరు పెడతార్రా—మా హోటల్లో పనికి కుదురు” అన్నాడు.

“చేరుతా బాబూ! ఏం పని చేయమంటారు” వినయంగా అన్నాడు కుర్రాడు.

“నీ వయస్సుకు తగిన పనులే కప్పులు, ప్లేట్లు కడగడం, బల్లలు తుడవడం...”

“అట్లాగే చేస్తానండి......”

“నీ పేరేమిటి?”

“జగ్గు—మా నాయనా, అమ్మా అట్లానే పిలిచేవారండి........”

“ఊ. సరేపద లోపలికి” అన్నాడు యజమాని.

మూడురోజుల తర్వాత జగ్గు ఆరోజు కడుపునిండా భోజనం చేశాడు. ఆ మరునాడే జగ్గును నీటుగా తయారు చేయించాడు హోటలు యజమాని. క్రాప్ చేయించి డ్రస్ కుట్టించాడు.

జగ్గుకు వేరే యిల్లు లేదు కాబట్టి హోటల్లోనే ఓ మూల పడుకొనేవాడు.

జగ్గు చేరిన వేళావిశేషమేమో, యజమాని అదృష్టం కలిసివచ్చి, ఆ యేడు హోటలు మీద బాగా లాభాలు తీశాడు నాయర్. హోటల్లో మరిన్ని వసతి సౌకర్యాలు అవీ ఏర్పాటు చేశాడు. జగ్గుకు జీతం పెరిగింది. వారానికి ఒకరోజు సెలవుండేది. ఆరోజు ఊరంతా తిరిగేవాడు. సినిమాలు చూసేవాడు. ఆ రోజుల్లోనే అర్ధరూపాయి పెట్టి ఫొటో తీయించుకొని, దానికి ఫ్రేము కట్టించి ఎంతో జాగ్రత్తగా పెట్టుకున్నాడు. ఎప్పుడైనా వేడితే హోటలలో పప్పు రుబ్బే సీనయ్య యింటికి వెళ్ళేవాడు జగ్గు. సీనయ్యకు లక్ష్మి అనే కూతురు జగ్గు ఈడుదే ఉంది. కొద్ది రోజుల్లోనే వాళ్లిద్దరికీ స్నేహం కలిసింది. సెలవురోజు వస్తే సీనయ్య ఇంటికి వెళ్ళి లక్ష్మితో ఆడుకునేవాడు. లక్ష్మి తల్లి రత్నాలు కూడా జగ్గును ఆపేక్షగా చూసేది.


“నీకు అమ్మా నాన్నా లేరా' అని ఓసారి లక్ష్మి అడిగితే బావురుమని ఏడ్చాడు జగ్గు. “వాళ్ళు బతికుంటే నేను పట్టణమెందుకొస్తా—నాకు ఈ హోటలు పనెందుకు” అన్నాడు. ఆ రోజంతా జగ్గుకు తల్లిదండ్రులే జ్ఞాపకం వచ్చారు. వాళ్ళ దుర్మరణం గూర్చి ఊళ్లో వాళ్ళు అనుకున్న మాటలే స్ఫురణకు వచ్చాయి.

జగ్గు తండ్రి ఓ భూస్వామి దగ్గర పాలేరుగా ఉండేవాడు. ఓ రోజు జగ్గు తల్లి పొలంలో ఉన్న భర్తకి అన్నం తీసుకువెళ్ళింది. పొలంలో భర్తకు బదులు భూస్వామే అక్కడ ఉండడం చూసి కొత్త బెదిరింది. “నీ మొగుణ్ని పక్క ఊరికి పనిమీద పంపించాను సీతాలూ—వస్తూనే ఉండాలి కూచో” ఓరగా చూస్తూ అన్నాడు కామందు. సీతాలు అందంగా యవ్వనంలో పెటపెట లాడుతుండేది. ఎన్నాళ్ల నుంచి సీతాలు మీద కన్నువేసి ఉంచాడో కామందు, ఒంటరిగా పొలంలో తారసిల్లేప్పటికి కోతికి కొబ్బరికాయ దొరికినట్లయింది. సీతాలును పాకలోకి దింపి, ఒంటి మీద చెయ్యివేసి దగ్గరకు లాక్కున్నాడు. సీతాలు పెనుగులాడింది. కామందు ఆమెను నిర్బంధిస్తున్నాడు. పట్టు విడిపించుకొని పారిపోతున్న సీతాలును కామందు ఓ డొంకలో చిక్కించుకున్నాడు. సీతాలుకు అప్పటికే శక్తి సన్నగిల్లిపోయి రొప్పుతున్నది. రొమ్ములు పైకి కిందికి కదులుతున్నాయి. తప్పించుకుంటానికి ఆఖరు ప్రయత్నం చేస్తున్న సీతాలుకు కాలు అడ్డం పెట్టేప్పటికి పడిపోయింది. తన పశువాంఛ తీర్చుకొని పైకి లేచాడు కామందు. గర్వంగా సీతాలు ముఖంలోకి చూశాడు. ఆమె కదల్లేదు, మెదల్లేదు. ఇటు అటు కుదిపాడు. ఆమెలో చలనంలేదు. శాశ్వతంగా కళ్ళు మూసింది సీతాలు. కామందు

పు స్త క ము లు

5 పుస్తకముల సెట్టు రు. 5–50.
(1) కొక్కోకశాస్త్రం (2) సుహాగ్‌రాత్ (3) చుంబన పద్ధతులు, (4) 84 ఆసనములు, (5) రహస్యఫోటో ఆల్బం. ఒక్కొక్క పుస్తకం రు. 2/–. పోస్టేజి, ప్యాకింగ్ అదనం. ఇంగ్లీషులో వ్రాయండి.

SULEKHA TRADERS,
WAT-7) .Beat No. 13, Aligarh




ఏజంట్లు : ప్రగతి ఏజన్సీస్, విజయవాడ— 1.




## అంతర్మథనం

కంగారుపడ్డాడు. ఆ కంగారుతో కూడా కర్తవ్యం స్ఫురించింది. "వాడు మొండి వాడు. ప్రాణాలు కూడా తీస్తాడు... ఊరి పొలిమేరలకు వాడు రాకముందే వాడి పని పట్టించాలి" అనుకున్నాడు, పలుకుబడి, హంగు, డబ్బు ఉన్న ఆ కామందు.

ఊళ్లో వాళ్లు చెప్పుకున్న ఈ కధనం జగ్గు పసి హృదయానికి అర్ధమైనంత అర్ధమైంది. కానిది కాలేదు. వలవల ఏడ్చాడు. ఊళ్లో వాళ్లు దయతలచి పిలిచి నాలుగు మెతుకులు పెడితే తినేవాడు. లేక పోతేలేదు. మూడురోజులు గడిచాయి. ఇక ఆ ఊళ్లో ఉండ బుద్ధి కాలేదు జగ్గుకు.

"రోజులు గడుస్తున్నాయి. లక్ష్మి అంటే జగ్గుకు ప్రాణంలో ప్రాణమైంది. ఆ చిన్నవయస్సులోనే 'లక్ష్మి నాది' అనే భావం మనసుతో ముద్ర వేసుకుంది. లక్ష్మి వద్దంటున్నా ఒకసారి ఫోటో కూడా తీయించాడు.

ఓ రోజు సీనయ్య పనిలోకి రాలేదు. ఏమో రాలేదు అనుకున్నాడు జగ్గు. ఆ మరు నాడూ రాలేదు సీనయ్య. డ్యూటీ అయ్యాక వెళ్లి కనుక్కోవాలనుకున్నాడు జగ్గు. రాత్రి ఎనిమిది గంటలప్పుడు రత్నాలు నాయర్ కోసం వచ్చింది. నాయర్ అంతకుముందే రత్నాలు రావడం గమనించాడేమో పైకి తన గదిలోకి వెళ్లిపోయాడు. యజమాని పైన ఉన్నాడు వెళ్లమన్నారు నౌకర్లు. రత్నాలు నాయర్ గది ముందుకు వెళ్లి నిలబడి "ఆయనకు, పిల్లకి జ్వరాలు వస్తున్నాయయ్యా. డాక్టర్ దగ్గరకు తీసుకు పోడానికి డబ్బు కావాలి. ఆయన జీతం లోంచి పది రూపాయలు అడ్వాన్సు యిప్పించండి" అంది.

"అయ్యో అలాగా పాపం, రా లోపలికి" అని గదిలోంచే అన్నాడు నాయర్. రత్నాలు అమాయకంగా లోపలకు వెళ్లేసరికి, నాయర్ తలుపు గడియ వేసి రత్నాలు చెయ్యి పట్టుకున్నాడు.

"ఏందిది—వదలండయ్యా!" అని పెనుగు లాడుతున్నది రత్నాలు. ఆమె పెనుగులాట నాయర్‌కు కవ్వింపై ఆమెను నిర్బంధిస్తున్నాడు. రత్నాలు రావడం, పైకి యజమాని గదికి వెళ్లడం చూసిన జగ్గు "ఈమె ఇంకా రాలేదేమా" అనుకుంటూ పైకి వెళ్ళాడు. గదిలోంచి రత్నాలు కేకలు విని తలుపులు బాదాడు జగ్గు. పేడో కొంప మునిగిందనుకొని తలుపు తెరిచాడు నాయర్. ఒక్క ఉదుటున బైటకు వచ్చింది రత్నాలు బెదరిన లేడిలా. ఆమె తలంతా రేగి ఉండడం, రవిక చిరిగి ఉండడం చూసిన జగ్గులో ఆవేశం పెల్లుబికింది.

"నీ కిక్కడేం పనుందని వచ్చావురా రాస్కెల్" అని గద్దించాడు నాయర్.

ఏమి చెప్పాలో, ఏం చెయ్యాలో తెలియని వయస్సు కావడం వల్ల తగిన సమాధానం చెప్పలేక సమయస్ఫూర్తిగా "మిమ్మల్ని కిందకు పిలుస్తున్నారు సార్!" అన్నాడు. కొరకొర చూస్తూ వెళ్లిపోయాడు నాయర్. "దేవుడిలా నీవు వచ్చావు కాని జగ్గూ లేక పోతే నాగతేమయ్యేదో!" అని కన్నీళ్లు పెట్టుకొని వెళ్లిపోయింది రత్నాలు.

ఆమరునాడు జగ్గు తాను మిగుల్చుకున్న డబ్బులోంచి పదిరూపాయలు తీసుకొని సీనయ్య ఇంటికి వెళ్ళాడు. రత్నాలుకు జరిగిన పరాభవం, తల్లి దుర్మరణానికి కారణం జగ్గు పసిహృదయంపై ముద్రవేసుకున్నాయి. అప్పటినుంచి డబ్బున్న వాళ్లంటే ఎంతో అసహ్యం, ఏదో పగ సాధించాలన్న తపన అతనిలో బయలుదేరింది. అతనికి ఏర్పడిన భావానికి దోహదం కలిగించేట్టుగా హోటల్లో బసచేసే వారి ప్రవర్తన, వాళ్ల కబంధహస్తాల్లో డబ్బుకోసం నలిగి పోతున్న అబలల పరిస్థితి చూచాయగా అర్ధమయ్యేవి.

సీనయ్యకు జ్వరం తగ్గింది కాని లక్ష్మికి తగ్గలేదు. మశూచికింద తేలి కన్నుమూసేప్పటికి జగ్గు మనస్సు విలవిలలాడి పోయింది. "అయ్యో—లక్ష్మి" అని ఏడ్చాడు. ఇంక ఆ ఊళ్లో ఉండలేక ఎటో బయలు దేరాడు.

పన్నెండేళ్లకాలం మింగేసింది. జగ్గు దేశంలో తిరిగి తిరిగి పట్టణం చేరుకున్నాడు. ప్రపంచంలో బ్రతుకు ఎలా ఉంటుందో తెలుసుకున్నాడు. ధనికులమీద పగతీర్చుకోడానికి తానూ ఆ స్థాయికి పెరగాలనుకున్నాడు. అతను పట్నం చేరేప్పటికి ఇరవై రెండేళ్ల వయస్సు. తాను కూడ పెట్టిన డబ్బుతో ఒక కిళ్లీదుకాణం పెట్టాడు. జగ్గుకు అదృష్టం కలిసి వచ్చింది. పదేళ్లలో జగ్గు పెద్దవ్యాపారస్థుడై పోయాడు. అతను ఏ వ్యాపారం ప్రారంభించినా ఎంతో లాభ సాటిగా ఉంటున్నది. జగ్గు జగన్నాధమైనాడు.

'జగన్నాథం జీవితంలో ఎంతమార్పు వచ్చినా ఎంత ఉన్నత స్థాయికి పెరిగినా అతని అంతరంగంలో నిలిచి పోయిన లక్ష్మి మాత్రం ' చెరగి పోలేదు.

అతని దినచర్యలో పగలు ఒకగంట, రాత్రి ఒకగంట లక్ష్మిజ్ఞాపకాలతో, తన బాల్యదశ, ఒక ప్రసిద్ధవ్యక్తిగా పెరిగిన విధానం జ్ఞాపకం చేసుకోడంలో గడిపి వేస్తాడు.

పట్టణానికి ఆరు మైళ్ల దూరంలో ఉన్న చిన్న పల్లెలో ఒక భవంతి కొన్నాడు. ఆ భవంతిలో ఒక గది తనకు కేటాయించు కొని మిగతాది ఎవరికో అద్దెకు యిచ్చాడు. వాళ్ళు ఎప్పుడైనా అద్దె ఇంతని యిస్తే పుచ్చుకునేవాడు. లేకపోతే ఎప్పుడూ అడిగేవాడు కాదు.

ఆ గదిలో ఒక మూల చిరుచాప, చిన్న ప్పుడు అర్ధ రూపాయికి తీయించుకున్న జగ్గుఫోటో, ఆ ప్రక్కనే లక్ష్మిఫోటో, వాటికి ఎదుటి గోడమీద జగన్నాథంగా తీయించుకున్న ఫోటో తగిలించి ఉంటాయి.

"లక్ష్మి బ్రతికి ఉంటే యించు మించు నా వయస్సులోనే ఉండేది. ఎంత అందంగా ఉండేదో. లక్ష్మి ఏ లోకంలో ఉన్నా నాదే!... ఎప్పుడూ నాదే" అనుకునేవాడు.

"చిన్నప్పటి నా ఫోటోకి ఇప్పటి ఫోటోకి ఎంత మార్పు ఉంది? చిన్నతనంలో ముఖంలో ఉన్న నిర్మలత్వం ఈ ఫోటోలో లేదేం,..... ఎందుకుంటుంది? జగ్గు పాపం— పుణ్యం తెలియని పసివాడు. ఈర్ష్య—, అసూ యలు, మద మాత్సర్యాలు లేని వినిర్మల మైన బాల్యదశ అది. ఇప్పటి జగన్నాథం

## అంతర్ముఖుడు

చాలా చిత్రమైన వాడు. ఏ మహానటుడూ చేయలేని నటన నాది. ఈ జగన్నాథం జూదరి, త్రాగుబోతు, వ్యభిచారి, మోస గాడు. ఇవన్నీ పైకి కనిపించకుండా నటించే పెద్ద మనిషి ఈ జగన్నాథం" అనుకొని తనను తాను అసహ్యించుకునేవాడు జగ న్నాథం.

జగన్నాథం దిన చర్యలోని ఆ రెండు గంటలు విలువైనవి. అవి ఎవరికీ అంతు పట్టనివి. ఇంతకు మించిన పరమ రహస్యం మరేదీ లేదనికూడా ఎవరికీ తెలియదు.

రోజు రోజుకీ తన చర్యల మీద, బ్రతుకు మీద ఏవగింపు ఎక్కువై పోయింది జగన్నాథానికి. "నేను ధనవంతు డినై ఏం సాధించ దలచుకున్నానో అది సాధించ లేక పోయాను. ఆ పగ అలాగే ఉండిపోయింది. ఇక ఈ నటనకు స్వస్తి చెప్పాలి. నాబోటి రాబందులంతా ప్రజలను పీక్కు తినడం, ధనాగారాలను నింపి పాపం మూట కట్టుకోడం తప్ప ఏముంది! ఎవరి కోసం సంపాదించాను ఇదంతా? ఎవరి మెప్పుకోసం? ఎవరి మెహర్బానీ కోసం? ఊహుఁ— జగన్నాథం చచ్చిపోవాలి. ఎప్పటి జగ్గు అయిపోవాలి." అని నిశ్చయించు కున్నాడు. అంతే— మూడు రోజులు అంతర్ధానమై పోయాడు జగన్నాథం. నాల్గవ రోజు పత్రికలలో జగన్నాథం ఆత్మహత్య అని తాటికాయంత అక్షరాలలో ప్రకటించ బడింది.

*  *  *

"ఇదేమిటి యింకా కూర్చున్నారేం— ఏదో సభకు వెళ్ళాలన్నారుగా" అంటున్న శ్రీమతి పలుకరింపుతో కళ్ళు తెరిచాను.

"ఏదో ఆలోచిస్తున్నా— జగన్నాథం సంతాప సభకు వెళ్ళాలి." అంటూ లేచాను.

టవున్ హాలులో ఏర్పాటు చేసిన జగ న్నాథం సంతాప సభకు బయలుదేరాను— నా ఊహల్ని నెమరు వేస్తూ, ఫుట్‌పాత్ మీద బూట్‌పాలిష్ చేస్తున్న కుర్రాడి పక్కన ఎవరో కూర్చుని పత్రిక చూస్తూ గలగల నవ్వుతున్నాడు. పరిశీలనగాచూశాను. పెరిగిన గడ్డం, తలకు మాసిన టోపీ, మాసి చినుగులు కనిపిస్తున్న ధోవతి, భుజాల మీద చిరిగిన లాల్చీతో ఉన్నాడు. "ఎవరతను?" పోల్చుకోడానికి ప్రయ త్నించా. ముఖానికి పత్రిక అడ్డు ఉండటం వల్ల సాధ్యం కాలా.

వూకదంపుడు ఉపన్యాసాలతో జగ న్నాథం సంతాప సభ పూర్తి అయింది. అక్కడ తేలిన విషయం జగన్నాథం తన ఆస్తినంతా మూడు రోజుల క్రితమే ధర్మ సంస్థలకూ, సేవా సంస్థలకూ వ్రాసి యిచ్చాడని, బ్రతికి ఉండగా అతను చేసిన ఘన కార్యాలనూ, ఔదార్యాన్నీ ప్రశం సిస్తూ చనిపోయే ముందు కూడా అతను ప్రదర్శించిన ఔదార్యాన్ని పొగడుతు జగన్నాథానికి జోహారు లర్పించారు.

హాలులోంచి బయటకు వస్తూంటే అంతకు ముందు ఫుట్‌పాత్ మీద పత్రిక చూస్తున్న వ్యక్తి కొందరి ముందు చెయ్యి జాపి "బాబూ— ముసిలోడ్ని— దరమం సేయండి" అని యాచిస్తున్నాడు. పరకా యించి చూశాను. నేను పరిశీలనగా చూస్తు న్నాననేమో ఆ వ్యక్తి పక్కకు తప్పుకున్నాడు. ఆ ముఖాన్ని పోల్చుకున్నా.... అతనే జగ న్నాథం. జగ్గుగా మారిన జగన్నాథం. జగన్నాథం అవతారం చాలించి లౌకిక బంధాలతో, మోసాలతో నిమిత్తంలేని జగ్గు అయిపోయాడు. 'జగ్గూ' అని పిలవాలని పించింది. కాని గొంతు పెకిలి రాలేదు.

ఎంత చరిత్ర జగన్నాథానిది!

ఎంత మార్పు జగన్నాథానిది!

"జగన్నాథం ఆత్మహత్య వార్త అతనే పత్రికలకు సరఫరా చేయించాడేమో! ఎంతైనా చతురుడు.... అన్న ఆలోచన లతో ఎదురుగా వచ్చి ఆగిన బస్సులోకి ఎక్కాను. ●

